క్లుప్తంగా

ఘనంగా స్వామివారి మాస కల్యాణం



ఆత్రేయపురంలో స్వామి వారి మాస కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం: స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి మాస కల్యాణాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పాలు, పుణ్యాహవచనం తదితర పూజాదికాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పాతపాటి రమణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వినయ్, వెంకట్రాజు తదితరులు పర్యవేక్షించారు.

స్వామివారి సన్నిధిలో రాజోలు సీఐ



రాజోలు సీఐ నరేష్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో ఆదివారం రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ కుటుంబసమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు పెద్దింటి రామశేషాచార్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. ఎంపీటీసీ భైరా నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోనల్ చైర్మన్‌గా హరీష్ నియామకం



హరీష్

ఆలమూరు: మండలంలోని పెనికేరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు కొడమంచిలి హరీష్ గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని హరీష్‌కు అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పత్తిపాటి సురేష్‌కుమార్ ఆదివారం అందజేశారు. నూతన చైర్మన్‌గా ఎంపికైన హరీష్ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చైర్మన్‌గా ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఆయుష్మాన్ కార్డులు ప్రజలందరికీ ఇవ్వాలి

మలికిపురం: ఆయుష్మాన్ ఆరోగ్య పథకం కార్డులు ప్రజలందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడబాల సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఏటా ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన వైద్యం దేశంలోని ఏ కార్పొరేట్ ఆసుపత్రిలోనైనా ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. ఇప్పటివరకూ దేశంలోని 69 కోట్ల మంది ప్రజలు ఆయుష్మాన్ భారత్ పథకంలో లబ్ధి పొందారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పాదయాత్ర

మామిడికుదురు: పవిత్ర ఇరాక్ దేశంలోని నజఫ్ నుంచి కర్బలాకు భక్తులు చేపట్టే హుస్సేన్ వాక్‌ను పురస్కరించుకుని మామిడికుదురు మండలం నగరం నుంచి పాశర్లపూడి దర్గా వరకు శనివారం రాత్రి ముస్లింలు పాదయాత్ర నిర్వహించారు. నగరం పెద పంజీషా వద్ద కర్బలా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి పాదయాత్ర చేపట్టారు. పాశర్లపూడిలోని బీబీ పాతిమా జహెరా దర్గా వరకూ పాదయాత్ర చేసి ప్రత్యేక ప్రార్థనల అనంతరం మాతం నిర్వహించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఖాసిం మహ్మద్ రజా, అలందార్ అబ్బాస్, నూరైన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిపాలెంలో వశిష్ట జూనియర్ కళాశాలలో ఆదివారం సంస్కృత భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కవి, భాషా పండితుడు పెద్దింటి శేషప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోని అతి ప్రాచీన భాషల్లో నేటికీ వాడుకలో ఉన్న భాష సంస్కృత భాష ఒక్కటేనన్నారు. అనంతరం అతిథులను సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పోతురాజు శ్రీనివాస్, ప్రిన్సిపల్ కె.సతీష్‌కుమార్, సంస్కృత శాఖాధిపతి పి.సత్య సాయిరాం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ భరత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోదారికి గుండె కోత

- నదీ గర్భంలో కలిసిపోతున్న సారవంతమైన భూములు
- గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని వేడుకుంటున్న రైతులు

మామిడికుదురు: గోదావరి నదీ కోత రైతులకు గుండె కోతను మిగులుస్తోంది. వైనతేయ గోదావరి నదీ తీరంలో గోదావరి కోత తీర గ్రామాల ప్రజలను కలవరపెడుతోంది. ఏటా వరదల సమయంలో ఎంతో సారవంతమైన భూములు గోదావరి నదీగర్భంలో కలిసిపోతున్నాయి. గత నెలలో వచ్చిన గోదావరి వరదకు తీరంలో కోత తీవ్రమైంది. వందలాది కొబ్బరి చెట్లు నదీగర్భంలో కలిసిపోయాయి. కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని రైతులు వేడుకుంటున్నా ఫలితం మాత్రం శూన్యం. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాత్రమే కోత నివారణ చర్యలు చేపట్టారు. తర్వాత వాటి వైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు గ్రామాల్లో పరిస్థితి తీవ్రం

వైనతేయ గోదావరి నదీ తీరంలోని కుడి వైపు పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో గోదావరి కోత తీవ్రంగా ఉంది. అప్పనపల్లిలో కోత నివాస గృహాలను సమీపించింది. దీంతో స్థానికులు కలత చెందుతున్నారు. మిగిలిన గ్రామాల్లో కొబ్బరి తోటలు కోతకు గురై నదిలో కూలిపోతున్నాయి. ఒడ్డు అంచులుగా నదిలో విరిగి పడుతోంది. గతంలో నిర్మించిన గ్రోయిన్లు గోదావరి వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి. రివిట్‌మెంట్ నదిలో దిగబడిపోతుంది. రోజురోజుకూ కోత మరింత తీవ్రమవుతుంది. కోత నివారణకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని తీర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పాశర్లపూడిలో నదిలోకి ఒరిగిన కొబ్బరి చెట్లు

13 కుంచాల భూమి పోయింది



మా కుటుంబానికి చెందిన 13 కుంచాల భూమి గోదావరి నదిలో కలిసిపోయింది. ఇంకా అయిదు కుంచాలు మాత్రమే మిగిలింది. గోదావరి కోత వల్ల తీవ్రంగా నష్టపోయాం. గతంలో ఎంతో మందికి విన్నపాలు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. నదీ కోత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పాలోలు భీమశంకరం, రైతు, బి.దొడ్డవరం

రివిట్‌మెంట్ నిర్మించాలి



గోదావరి నదీకోత తీరంలోని భూములను కబళిస్తోంది. కోతతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోత నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం తప్ప ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించాలి. రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలి.

– ఉప్పే ప్రదీప్, రైతు, పాశర్లపూడి

రెండెకరాలకు పైగా కోల్పోయాం



పెదపట్నంలంక గ్రామంలో గోదావరి కోత తీవ్రంగా ఉంది. కోత నివారణకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్ సైతం కొట్టుకుపోతున్నాయి. కోత నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. కోత కారణంగా మేము రెండెకరాలకు పైగా కోల్పోయి తీవ్రంగా నష్టపోయాం. కోత నివారణ చర్యలు చేపట్టి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– జోగి అర్జునరావు, రైతు, పెదపట్నంలంక

ప్రతిపాదనలు పంపించాం

వైనతేయ గోదావరి నదీతీరంలో అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో గోదావరి కోత ఎక్కువగా ఉన్నట్టు గుర్తించాం. కోత నివారణకు రివిట్‌మెంట్, గ్రోయిన్లు నిర్మించడానికి సుమారు రూ.82 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నాం. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– టీవీఎల్ఎన్ మూర్తి, హెడ్ వర్క్స్ ఏఈఈ, రాజోలు

మూఢ నమ్మకాలను విడనాడాలి



సదస్సులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

మలికిపురం: ప్రతిఒక్కరూ మూఢ నమ్మకాలను విడనాడాలని కేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాల నిరోధక చట్టం సాధన కోసం అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాల మీద అవగాహన పాఠశాల స్థాయి నుంచే జరగాలని, విద్యతోనే మూఢ నమ్మకాలు సమసిపోతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం మూఢ నమ్మకాల నిరోధక చట్టం సాధనపై వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జేవీవీ జిల్లా కార్యదర్శి వివేకానంద ప్రసాద్, రిటైర్డ్ నేవీ ఉద్యోగి విజయరావు, పూర్వ రోటరీ గవర్నర్స్ శివ, మురళి, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊబలంకలో హనుమాన్ చాలీసా పోటీలు



ఊబలంకలో హనుమాన్ చాలీసా పఠన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

రావులపాలెం: మండలంలోని ఊబలంకలోని హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ చాలీసా పోటీలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని 15 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో ఎస్. విద్యాసాయి, ద్వితీయ స్థానంలో కె.కావ్య వెంకటశ్రీ , తృతీయ స్థానంలో జి.సాత్విక్ నిలిచారు. వారికి వరుసగా రూ. 2 వేలు, రూ.వెయ్యి, రూ.500 చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ఆలయ కార్య నిర్వహణాధికారి చింతా ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హనుమాన్ చాలీసా పఠనంపై శిక్షణ ఇచ్చిన ఆలయ అర్చకుడు గుంటూరు వెంకట శివ రామకృష్ణ శర్మను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం



లక్కవరంలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

మలికిపురం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ లక్కవరం గురయ్య ఇంటర్ మరియు డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఆదివారం గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక బట్టిలంక సెంటర్లో మానవహారం చేపట్టారు. కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకట సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఇది అత్యంత హేయమైన చర్య న్నారు. ర్యాలీలో అకడమిక్ డైరెక్టర్ ఏబీ నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాంబాబు, అరుణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌కు సహకరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న మాలల న్యాయ పోరాట సమితి ప్రతినిధులు

మామిడికుదురు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న భారత్ బంద్‌కు ప్రజలు సహకరించాలని మాలల న్యాయ పోరాట సమితి ప్రతినిధులు కోరారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో భారత్‌బంద్‌కు సంబంధించిన కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు, ముఖ్య సలహాదారు నల్లి శ్రీనివాస్, కోర్ కమిటీ సభ్యులు కలిగితి పళ్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, బత్తుల జనార్ధనరావు, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసుమ పెరుమాళ్లకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దీనిని మాలల న్యాయ పోరాట సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

పాపన్న గౌడ్ పోరాట పటిమ యువతకు ఆదర్శం



సభలో మాట్లాడుతున్న తెలంగాణ ఐజీ సత్యనారాయణగౌడ్

అమలాపురం రూరల్: బహుజనులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారమే సాధనమని భావించి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చూపిన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఐజీ వెలివెల సత్యనారాయణ గౌడ్ సూచించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా కోనసీమ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం కామనగరువులో నూతనంగా నిర్మించిన పాపన్న గౌడ్ నిలువెత్తు విగ్రహాన్ని ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులతో కలిసి ఐజీ సత్యనారాయణగౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి బహుజనుల కోసం పెత్తందారులను ఎదిరించి నిరంకుశత్వ పాలనన నుంచి విముక్తి కల్పించిన పాపన్నగౌడ్ చరిత్ర తెలుసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోనసీమ గౌడ్ సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు), విశ్రాంతి డీఎస్పీ ఈడే అశోక్ కుమార్‌గౌడ్, మెట్ల రమణబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, జయ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మార్పణ్ పథకానికి అవార్డు



ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న తాళ్లరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులకు ఫీడ్ ది హంగర్ సేవా కార్యక్రమంలో భాగంగా తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ పథకానికి వరుసగా రెండోసారి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో జరిగిన 2023–24 లయనిస్టిక్ అవార్డు ఫంక్షన్‌లో లయన్స్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ చేతుల మీదుగా తాళ్లరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధులు అవార్డు అందుకున్నారు. రెండోసారి అవార్డు రావడంపై క్లబ్ ప్రతినిధులు బి.శ్రీనివాస రెడ్డి, పొన్నాడ పేరయ్యరాజు, కె.బాబి, శ్రీనివాస్, మాలతీవసుంధర, కె.ఆదినారాయణ, దత్తు, అప్పారావు తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

విచక్షణా రహితంగా పురుగు మందులు వాడొద్దు



వరి చేలో కలుపును తీస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగం పంటలకు అనర్థమని ఏవో జె.లక్ష్మి రైతులకు సూచించారు. పురుగు మందులు అధికంగా వినియోగించిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ తక్కువగా ఉంటుందన్నారు. వరి పైరులో కలుపును సకాలంలో నివారించుకుంటే దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. వరి నాట్లు ప్రారంభం నుంచే కలుపు నివారణ చర్యలు చేబడితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. వరిలో ఊద తదితర గడ్డి జాతి మొక్కలు ఉంటే బ్యుటాక్లోర్ 50 శాతం 1 నుంచి 1.5 లీటర్లు లేదా అనిలోఫాస్ 30 శాతం 500 మిల్లీలీటర్లు లేదా ప్రైటిలాక్లోర్ 50 శాతం 500 మిల్లీలీటర్లు ఏదో ఒక దానిని ఎకరాకు 25 కిలోల పొడి ఇసుకలో కలిపి, నాటిన 3 నుంచి 5 రోజుల్లో పలుచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలన్నారు. 35 నుంచి 50 గ్రాముల ఆక్సాడయార్జిల్ 80 శాతం పొడి మందును 500 మి.లీ నీటితో కలిపి ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకతో కలిపి నాటిన 3 నుంచి 5 రోజుల్లో పలుచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలని ఏవో సూచించారు. అలాగే పురుగు మందుల కొనుగోలులో జాగ్రత్తల గురించి ఏవో లక్ష్మి వివరించారు. పైరును ఆశించింది కీటకమా లేక తెగులా అనేది రైతులు ముందుగా నిర్ధారించుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మందులు మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పారు. లీకేజీ లేని , సీలు సరిగా ఉన్న సస్యరక్షణ మందులనే కొనాలని సూచించారు. ఒకే రకం పురుగు మందును ఎక్కువ సార్లు వాడకూడదని ఏఓ జె.లక్ష్మి సూచించారు.



మండల వ్యవసాయాధికారి లక్ష్మి

వైభవంగా పరదేశమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పరదేశమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

తాళ్లరేవు: తాళ్లరేవు గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ వీధిలోని అమ్మవారి అంగన్‌గుడి నుంచి ఆలయానికి కొత్త అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గరగ నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు, బొమ్మల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలి

కొత్తపేట: జిల్లా కేంద్రమైన అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని పలువురు కోనసీమ వాసులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమేరకు కొత్తపేటకు చెందిన ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం నాయకుడు తమ్మన సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసి ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంతో కాలం క్రితమే అమలాపురం పట్టణంలో ఒక రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఉండేదన్నారు. ఈ ప్రాంత ప్రయాణకులు ఎంతో సులువుగా రైల్వే ప్రయాణాలకు ఆ కౌంటర్‌ను వినియోగించుకున్నారని పేర్కొన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఆ కౌంటర్‌ను తొలగించి, హెడ్ పోస్టాఫీస్‌కు మార్చారని సాయిప్రసాద్ గుర్తు చేశారు. దాంతో సేవలు పరిమితం కావడం, సెలవు దినాల్లో రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడంతో రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టిక్కెట్ల సమాచారం, టిక్కెట్లు రద్దు చేసుకోవాలన్నా రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు ఎంపీ హరీష్‌తో పాటు జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, కోనసీమ ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అడబాల సత్యనారాయణ (ఫైల్)

ఆలమూరు: చొప్పెల్ల వద్ద 216 ఏ రహదారిపై కొండాలమ్మ వారి ఆలయం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అడబాల సత్యనారాయణ (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం ఈనెల 17న ఇటుక లోడుతో వెళుతున్న వ్యాన్ లారీ రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ పరిస్థితి విషమించడంతో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో కాకినాడ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్బారావు కవితకు ప్రశంసలు



అమలాపురంలో సుబ్బారావును సత్కరిస్తున్న కళావేదిక సభ్యులు

కొత్తపేట: అమలాపురంలో జరిగిన 138వ జాతీయ కవి సమ్మేళనంలో కొత్తపేటకు చెందిన కవి, రచయిత వులుసు వీవీఎస్ సుబ్బారావు వినిపించిన 'తెలుగు కీర్తి సౌరభాలు' పద్య కవిత శ్రోతల ప్రశంసలందుకుంది. ఈ సందర్భంగా సుబ్బారావును కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, సభ్యులు, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తిని స్మరించుకుంటూ వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు బీఎస్ రావు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.